# మనసే కావాలి

**" నువ్వు లేకుండా నేను బతకలేను సురేష్... నా పెళ్ళి జరిగితే నీ తోనే...లేకపోతే జీవితాంతం పెళ్ళి చేసుకోకుండా ఉండిపోతాను. "**

సురేష్ గుండెల్లో తలదాచుకుంది అర్చన. సురేష్, అర్చన ఒకరినొకరు ప్రేమించుకున్నారు. మనస్ఫూర్తిగా అర్చనని ప్రేమించిన సురేష్ కూడా అన్నాడు " నీకు తప్ప నా మనసులో వేరొకరికి చోటు లేదు అర్చనా. నువ్వు నా ప్రాణం. ఏ కారణంగానైనా మన పెళ్ళి జరగకపోతే ఆజన్మాంతం నేను బ్రహ్మచారిగానే ఉండిపోతాను " సురేష్ దృష్టిలో ఆమె ఒక దేవత .... ఆమెకోసం ప్రాణమైనా ఇవ్వటానికి అతను సిద్ధమే .... అతని మనసు మచ్చలేనిది .... అతని ప్రేమ వంక పెట్టలేనిది ....

*

అర్చనకి ఈ మధ్య పరిచయమయ్యారు రజని, ఆమె అన్న శేఖర్. అంత గొప్పవాళ్ళతో అంత డబ్బు హోదా ఉన్నవాళ్ళతో పరిచయం స్నేహంగా మారడం చాలా గర్వంగా ఉంది అర్చనకి.

శేఖర్ అందాన్నీ, అంత కంటే ముఖ్యమైన అతడి వెనక ఉన్న ఆస్తిపాస్తుల్ని తల్చుకుంటూ పంచరంగుల కలలు కంటూ తనలో తనే నవ్వుకుంటూ శేఖర్ వాళ్ళింటి నుంచి వస్తోంది ఆ రోజు.

లత ఎదురుపడింది రోడ్డుమీద. చటుక్కున మొహం తిప్పేసుకుంది పలకరించడం ఇష్టంలేక. కానీ తను పలకరించకుండా ఉండలేక పోయింది లత.

" బావున్నావా అర్చనా ! మీ అమ్మగారెలా ఉన్నారు ? "

" ఏం ? మీ అమ్మగారికామధ్య జబ్బు చేసిందని మా అమ్మకు కూడా ఏదన్నా రావాలనుకుంటున్నావా ? బానే ఉంది మా అమ్మ " పుల్ల విరిచినట్టే జవాబిచ్చింది.

పెద్ద జబ్బు చేసి తగ్గిన తన తల్లి గురించి యోగక్షేమం అడగడం కనీస ధర్మంగా భావించకపోవడమే కాకుండా పైగా కోపంగా మాట్లాడటంతో షాక్ తిన్నట్టయింది లతకి.

" సారీ అర్చనా ! నేనా ఉద్దేశ్యంతో అడగలేదు. మామూలుగా కుశల ప్రశ్నలుగా అడిగానంతే. నీ మనసు నొప్పిస్తే క్షమించు "

" హూ ! " విసుగ్గా మొహం పెట్టి అర్చన వెళ్ళిపోబోతుంటే చిరునవ్వుతో ఆపింది లత ' ఒక్క క్షణం ' అంటూ.

" ఈ రోజు నీ పుట్టినరోజు కదా అర్చనా "

" ఓ .... బానే గుర్తుంచుకున్నావే " ఎందుకో ఆ ఎత్తిపొడుపు.

" ఎలా మర్చిపోతాను స్నేహితురాలి పుట్టినరోజు. ప్రతి ఏడూ బర్త్‌డే విషెస్ చెప్పడానికి మీ ఇంటికి వచ్చేదాన్నిగా. ఈ మధ్య చాలా రోజులుగా నన్ను చూస్తేనే మొహం తిప్పేసుకుంటున్నావు, అంచేత ధైర్యం చేసి మీ ఇంటికి రాలేకపోయాను. అనుకోకుండా ఇపుడు

కనిపించినందుకు చాలా సంతోషంగా ఉంది. విష్ యూ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే" చేతిలో ఉన్న కూరల సంచిలోంచి ఎర్ర గులాబీ తీసి అందించింది.

పురుగుని చూసినట్టు ఆ పువ్వు వంక చూసింది అర్చన. "ఛీ-ఛీ రాత్రికోసం కొనుక్కున్నట్టున్నావు. అది తీసుకొనే ఖర్మ నాకేం పట్టలేదు" మాట పూర్తవుతూనే విసురుగా లత భుజాన్ని గట్టిగా రాసుకుంటూనే త్వరత్వరగా వెళ్ళిపోయింది ముందుకి. ఆ విసురికి లత చేతిలోని గులాబీ కింద మట్టిలో పడింది. అది పువ్వు కాదు ఆమె మనసే. అది మట్టి కాదు మంటల్లాంటి అర్చన మాటలే. వొంగి ఆ పువ్వుని తీసి మృదువుగా తుడిచి సంచీలో పెట్టుకుంది. కళ్ళలో తిరిగిన నీటిని పంటి బిగువున దిగమింగుకుంది. ఇంటి ముఖం పట్టింది ....

సృష్టిలో తీయనిది స్నేహమేనోయి .... ఇంద్రగంటి జానకీబాల తీయగా పాడటం వినిపిస్తోంది రేడియోషాపులోంచి. స్నేహంలో తీపి-తీపి స్నేహం ఎలా ఎలా ఉంటుంది? ఎక్కడుంది! తన అనుభవంలోకి రాలేదు. ప్రాణస్నేహితురాలనుకున్న అర్చన....ఆ అర్చనేనా ఇప్పటి ఈ అర్చన. స్నేహంలో చేదు రుచి చూపిస్తోంది. స్నేహంలో తీపి అనుభవించేవాళ్ళు ఎంత అదృష్టవంతులో! ....

ఇంటికెళ్ళాక కిందపడిన ఆ గులాబీని నీళ్ళల్లో కడిగి తల్లి చేతికందించింది.

ఆ పువ్వు దేవుడి ఫోటోకి పెట్టి దండం పెట్టుకుందావిడ. ప్రతిరోజూ పూలు కొనలేకపోయినా శుక్రవారం మటుకు ఏదో ఓ పువ్వు దేవుడికి పెట్టడం ఆవిడ అలవాటు. ఆరోజు శుక్రవారం.

"దేవుడున్నాడామ్మా?"

ఎన్నడూ లేనిది కూతురి నోటినించి ఆరోజు ఆ ప్రశ్న రావడం వింతగా అనిపించింది ఆవిడకి.

" ఉన్నాడు తల్లి....ఏదో ఓ రూపంలో మన కష్టాల్లో మనకి సాయపడుతూనే వున్నాడు...." ఆమె నమ్మకమే ఆమె పాలిటి దేవుడు.

"అయితే....అయితే...ఎంత బతిమాలినా ఎవ్వరూ సాయపడనపుడు నీ వైద్యంకోసం తప్పనిసరి పరిస్థితుల్లో నిన్ను బతికించుకుందుకు నేను చేసిన ఆ పని....తప్పుకాదేమో....దేవుడే ఆ రూపంలో సాయపడ్డాడను కుంటాను...." ఈ మాటలు లత గొంతులోనే వుండిపోయాయి. చేతులు జోడించి దేవుడికి నమస్కరించి భక్తిగా కళ్ళు మూసుకుని ఏ రూపంలో సాయపడినా నా తల్లిని నాకు దక్కించావు. అపుడే అమ్మని తీసికెళ్ళిపోయి నన్నొంటరిని చేసెయ్యలేదు. నీకు మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను....

కృతజ్ఞతతో గుండె బరువెక్కి కళ్ళు చిమ్మిన నీళ్ళు ఆ దేవుడికి అభిషేక జలాలే అయ్యాయి....అంతకంటే పవిత్ర జలం భక్తితో ఎవరు మాత్రం, ఏ దేవుడికి అర్పించగలరు ?....

*

"అమ్మాయ్ ! ఆ శేఖర్ తల్లికి నువ్వంటే చాలా ఇష్టం, నీలాంటి పిల్ల కోడలుగా వొస్తే బావుంటుందని, ఎవరితోనో అందిట కూడా. వాళ్ళ తాహతుకి మనం తూగకపోయినా, ఆవిడకి నువ్వు నచ్చావు కాబట్టి మన అదృష్టం మనం పరీక్షించుకోడంలో తప్పులేదుగా " ఓ ముక్క అడిగేసొస్తాను....నీ ఉద్దేశం ఏవిటి ? శేఖర్ని చేసుకోవడం నీ కిష్టమేనా?"

తండ్రి ప్రశ్నకు సిగ్గుపడుతూ అందంగా నవ్వింది అర్చన. తలవొంచుకుని మెల్లిగా అంది "మీ ఇష్టం నాన్నగారూ...."

సంతోషంగా శేఖర్వాళ్ళ ఇంటికి బయల్దేరాడాయన. అర్చన ఆనందానికి అవధులే లేవు....

శేఖర్ ఒంటరిగా వుండగా, గాలిదుమారంగా వొచ్చింది అర్చన.

"నన్ను చేసుకోవడం మీ కిష్టంలేదనీ, లతని చేసుకుంటాననీ అన్నారుటగా మీ అమ్మగారితో, ఒకప్పుడు నాకూ, మీ చెల్లెలికీ కూడా స్నేహితురాలే ఆ లత.... ఆ మాట నిజమే.... కాని ఇప్పుడు ఎటువంటిదో తెలిసే తనని చేసుకుంటానంటున్నారా మీరు ? అటువంటిదాన్ని పెళ్ళి చేసుకునే ఖర్మేమిటి మీకు ? తన ముందు నేను ప నీ కి రా కుం డా పోయానా ?...."

చిన్నగా నవ్వాడు శేఖర్.

ఆ నవ్వుకి మరింత కోపం వచ్చింది అర్చనకి.

"నవ్వుతారేమిటి ?.... లతకి తల్లి తప్ప మరెవ్వరూ లేరు.... ఒకప్పుడు బాగా బతికిన కుటుంబం అయితే అవచ్చు. కానీ ఇప్పుడేమీ లేనివాళ్ళేగా.... ఆ మధ్య వాళ్ళమ్మకి బాగా జబ్బుచేసి, ప్రాణంమీదికొచ్చి నప్పుడు వైద్యానికి, డబ్బులేక ఎవరికో ఒళ్ళమ్ముకుంది లత.... అటువంటి దాన్ని పెళ్ళిచేసుకుంటానంటున్నారు మీరు.... మతిపోలేదు కదా మీకు ?...."

"మతివుంది కనకనే లతని అర్థంచేసుకోగలిగాను—నాకు మనసున్న మనిషి కావాలి తప్ప మనసులేని జీవచ్ఛవం అక్కర్లేదు—"

"ఏవిటి మీరనేది ? లత మనసున్న మనిషా ? నేను జీవచ్ఛవాన్నా ?"

"నీకు కోపం తెప్పించినందుకు క్షమించు—నా ఉద్దేశం నేను చెప్పాను. సురేష్‌ని మనస్ఫూర్తిగా ప్రేమించాననీ, అతన్నే పెళ్ళాడతాననీ నువ్వు అతన్ని నమ్మించిన మాట అబద్ధం కాదుగా ? అతనికి లేని

లక్షలు, హోదా నాకున్నాయని....ఇప్పుడు....అతన్ని కాదని, నన్ను పెళ్ళాడటానికి ఇష్టపడుతున్నావు. సురేష్‌కి అర్పించిన మనసుని.... ఇప్పుడు, నా డబ్బుచూసి నా కమ్ముకుందుకు సిద్దమవుతున్నావు. డబ్బు కోసం మనసమ్ముకునే మనిషి జీవచ్ఛవంకాక మరేమిటి !

అంతకంటే లత చేసిన పని ఎన్నో రెట్లు నయం కదా ! ఒళ్ళమ్ముకుందే తప్ప మనసమ్ముకోలేదు. ఆమె మనసు ఆమె సొంతమే. డబ్బుకోసం మనసమ్ముకోలేదు....మనసున్న మనిషి తను... జీవచ్ఛవం కాదు....అటువంటి లతకి చేయందించి, చేయూత నివ్వాలనుకోడం నేరం అవుతుందా ? మంచిపని చేస్తానంటే మతిపోయినట్టు అర్థమా ? ”

ఛెళ్ళున కొట్టినట్టయింది అర్చనకి....ఒక మనసంటూలేని.... నిజమైన మనసంటే ఏమిటో తెలియని....అందమైన బొమ్మలాటి అర్చనకి.

—0₀0—